ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

సేవాలాల్ ఆలయం వద్ద ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పకడ్బందీగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-గుత్తి

సేవాఘడ్‌లో ఈనెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సేవాఘడ్ సమావేశ మందిరంలో సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలపై ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకు గుంతకల్లు, గుత్తి రైల్వేస్టేషన్‌ల నుంచి సేవాఘడ్‌కు ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. అవసరమైతే వివిధ ప్రాంతాల నుంచి బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. సేవాఘడ్‌కు దిశా నిర్దేశం చేసే సూచిక బోర్డులను తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఏర్పాటు చేయాలన్నారు. సేవాఘడ్ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లును ఫిబ్రవరి 12లోపు పూర్తిచేయాలన్నారు. విద్యుత్, తాగునీటి సమస్య రాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జయంతి ఉత్సవాలు ముగిసేంత వరకు సేవాఘడ్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంస్కృతిని చాటిచెప్పే ప్రదర్శన నిర్వహణకు చర్యలు తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, సంత్ సేవాలాల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా టెక్స్‌టైల్ పార్కులు.!

ఒక జిల్లా... ఒక ఉత్పత్తి కింద ఉన్నా ప్రోత్సాహకం కరువు

విజన్ 2047లోనైనా దృష్టి సారించేరా.?

రాయదుర్గం టెక్స్‌టైల్ పార్కు ముఖద్వారం

అనంతపురం జిల్లాలో టెక్స్‌టైల్ పరిశ్రమలు వేలాది మందికి ఉపాధిని చూపుతున్నాయి. ఈరంగం ప్రధానంగా పామిడి, రాయదుర్గంలో విస్తరించి ఉంది. రాయదుర్గంలో జీన్స్ వస్త్ర పరిశ్రమ వ్యాప్తి చెంది ఉండగా, పామిడిలో నైట్ వేర్స్ వస్త్ర వ్యాపారం విస్తరించి ఉంది. ఈ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ రంగాన్ని ప్రోత్సహిస్తామని ప్రకటనలు చేస్తున్నాయి. అయితే ఆశించినంతగా ప్రోత్సహకం లభించడంలేదు. కనీసం వీటి కోసం ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కులు కూడా అభివృద్ధికి నోచుకునే పరిస్థితుల్లేవు. ఈ రెండు చోట్ల కూడా వస్త్ర వ్యాపారం మందగమనంలో సాగుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయదుర్గంలో జీన్స్ వస్త్ర వ్యాపారం పెద్దఎత్తున ఉంది. సుమారు 600 యూనట్ల వరకు ఉన్నాయి. ఈ రంగంపై ఆధారపడి ఇక్కడ 50 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. కోవిడ్ నుంచి ఈ రంగం కోలుకోలేని పరిస్థితుల్లో ఉంది. సుమారు చిన్న, చితక యూనిట్లు 300 వరకు మూతపడ్డాయి. 74 ఉడేగోళం వద్ద 50కిపైగా యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశమున్నా ప్రస్తుతం రెండు మాత్రమే నడుస్తున్నాయి. అవి కూడా మందగమనంలోనే సాగుతున్నాయి. వీటికి ప్రోత్సహకం అందివ్వాల్సి ఉంది. ప్రభుత్వాలు అటువైపు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఈ పరిశ్రమకు అవసరమైన చేయూతను అందివ్వాలని అక్కడి వ్యాపారులు కోరుతున్నారు.

రెండు దశాబ్దాలైనా పూర్తవని టెక్స్‌టైల్ పార్కు

జిల్లాలో రాయదుర్గం తరువాత పామిడి ప్రసిద్ధి. నైట్‌వేర్ దుస్తుల్లో దీన్ని రెండవ ముంబయిగా పిలుస్తారు. సుమారు పది వేల కుటుంబాల వరకు ఈ రంగంపై ఆధారపడి ఉన్నాయి. దీనికి ప్రోత్సాహకం అందిస్తామన్న పేరుతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు 2004లో శంకుస్థాపన చేశారు. ఇప్పటికి సరిగ్గా రెండు దశాబ్దలు పూర్తయినా నిర్మాణం పూర్తవలేదు. రూ.1.76 కోట్లు ఖర్చు వృథాగానే ఉండిపోయింది. ఇప్పుడు చేనేత జౌళి శాఖ మంత్రిగానూ సవితమ్మ ఉన్నారు. ఈ రంగంపై ఆమె దృష్టి సారించి తగిన విధంగా చర్యలు తీసుకుంటారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

ప్రభుత్వం ఈ రంగాన్ని ఆదుకోవాలి

కరువు ప్రాంతమైన ఈ జిల్లాలో ఉపాధి చూపించే పెద్ద రంగంగా వస్త్ర రంగం ఉంది. రాయదుర్గం, పామిడిల్లో వేలాది మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ రంగం తీవ్రం సంక్షోభంలో ఉంది. ఆన్‌లైన్ వ్యాపారం ఊపందుకున్న తరువాత ఇక్కడి వ్యాపారులపై ప్రభావం పడుతోంది. వేలాది మంది ఉపాధిని కోల్పోయే పరిస్థితులున్నాయి. ప్రభుత్వం ఆ రంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టాలి.

బి.శ్రీనివాసులు, వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు.

రాయదుర్గంలో జీన్స్ ప్యాంట్లకు స్టిచ్చింగ్ చేస్తున్న కార్మికులు

లింగ నిర్ధారణ నేరం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని డాక్టర్ గీతాభార్గవి తెలిపారు. మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ జడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు లింగ నిర్ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎకడైనా లింగ నిర్ధారణ చేయించుకున్నట్లు, డాక్టర్లు చేసినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళ లేకపోతే సంతాన ఉత్పత్తే లేదన్న విషయాన్ని సమాజంలోని ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యా ఎడ్యుకేటర్ భారతి, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని డ్వామా కార్యాలయం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మంజునాథ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, భూపసముద్రం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే సిఐ జయనాయక్ సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం కలగకుండా పరిస్థితిని చక్కదిద్దారు.

రైతులకు పాడి ఆవులు పంపిణీ

ప్రజాశక్తి-కుందుర్పి

పాడి ఆవుల ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎంపిపి కమల నాగరాజు తెలిపారు. మండలంలోని జంబుగుంపల గ్రామంలో గురువారం పశు వైద్యాధికారి ప్రసాద్ కుసుమగిరి రైతు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం నుంచి పది మంది రైతులకు ఆవులు పంపిణీ చేశారు. ఎంపిపి మాట్లాడుతూ రైతులకు ఉచితంగా ఆవులను పంపిణీ చేసేందుకు కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం సిఇఒ నరసింహమూర్తి సాయం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సంఘం అనేక పథకాల ద్వారా మహిళల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. వ్యవసాయపరంగా అర్హులైన ప్రతి రైతుకూ మామిడి మొక్కలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కుసుమగిరి రైతు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం సిఇఒ నరసింహమూర్తి, పశు వైద్యాధికారి ప్రసాద్, పశువైద్య సిబ్బంది, సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించండి : సిఐ



రాయదుర్గం : పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, వ్యాపారులు, పాత్రికే యులు అందరూ సహకరించాలని సిఐ జయనాయక్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్, సైబర్ నేరాల నియంత్రణలో ఆల్ మర్చెంట్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యావం తులు, యువకులు, భాగస్వాములు కావాలని కోరారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతిలేకుండా బహిరంగ సభలు, రాస్తారోకోలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టకూడదన్నారు. అవసరమైతే పోలీస్ శాఖ నుంచి అనుమతి పొందాలన్నారు.

సమగ్ర చర్యలతోనే పండ్లతోటల రైతులకు లబ్ధి

- ◆ పంటల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- ◆ డ్రిప్, స్ప్రింక్లర్లు 90 శాతం సబ్సిడీతో పదెకరాల వరకు ఇవ్వాలి
- ◆ అనంత ఉత్పత్తులను ప్రపంచానికి చాటేలా ఉద్యానవన సమ్మేళనం నిర్వహణ అభినందనీయమే..
- ◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమగ్ర చర్యలు చేపట్టి ప్రభుత్వం విరివిగా రైతులకు ప్రోత్సాహాలు అందిస్తేనే పండ్ల తోటల రైతులకు లబ్ధి చేకూరుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్పతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలో ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉద్యానవన సమ్మేళనం ఈ ప్రాంత ఉద్యానవన ఉత్పత్తుల గురించి ప్రచారానికి తోడ్పడాన్ని సిపిఎం స్వాగతిస్తోందన్నారు. అయితే పండ్ల తోటల రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ కంపెనీల ఒప్పందాలే పరిష్కారమన్నట్లు భావించడం సరికాదన్నారు. కంపెనీలతో ఒప్పందాలు ఉద్యావన రైతులను ఆదుకోలేవని, ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా అనంతను తీర్చి దిద్దాలంటే పండ్ల తోటల రైతులను ఆదుకోవడానికి సమగ్ర చర్యలు చేపట్టడమే మార్గం అన్నారు. జిల్లాలో 15 సంవత్సరాల్లో వచ్చిన వరుస కరువులతో మెట్ట వ్యవసాయం తీవ్ర సంక్షోభానికి గురైందన్నారు. ఈ పరిస్థితుల్లో సాగునీటి వనరుల అభివద్ధిలో తక్షణ ప్రత్యామ్నాయంగా మైక్రో ఇరిగేషన్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వాలు సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, రాయితీలు ఇవ్వడం, ఉచిత కరెంట్, ఉపాధి హామీ చట్టం ద్వారా డ్రైలాండ్ హార్టికల్చర్ అభివద్ధి చేయడంతో ఉద్యాన పంటల సాగు పెరిగిందన్నారు. దేశంలోనే మంచి రుచి కరమైన పండ్లు ఇక్కడ పండుతుండడం భౌగోళికంగా మరో గొప్ప అవకాశం అన్నారు. వీటన్నింటి వల్ల తక్కువ కాలంలో అరటి, ఎండుమిర్చి, చీనీ, టమోటా, మామిడి లాంటి ఒక్కో పంట 10 వేల హెక్టార్లకు పైగా సాగు జరుగుతోందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహించిన అనంత ఉద్యానవన సమ్మేళనం పండ్ల తోటల రైతులను సమగ్రంగా ఆదుకోవడానికి బదులు కంపెనీలు, ఒప్పందాల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. వందకు పైగా కంపెనీలు వస్తాయని ఆశిస్తే కేవలం ఏడు కంపెనీలు మాత్రమే ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. ఈ కార్యక్రమం ప్రచారానికి ఉపయోగపడిందే తప్ప రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. కంపెనీల ఒప్పందాలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ వ్యవసాయ విధానంలో భాగం అన్నారు. వీటి వల్ల కంపెనీలు బాగుపడుతాయే తప్పా రైతులకు మేలు జరగదన్నారు. ఉద్యానపంటల రైతులను ఆదుకోవడానికి అమల్లోకి తెచ్చిన డ్రిప్, స్ప్రింక్లర్ల సబ్సిడీ నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దీనిని పూర్తి స్థాయిలో అమల్లోకి తెచ్చి 90 శాతం సబ్సిడీతో 10 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలను రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి డ్రిప్‌పై జిఎస్‌టి రద్దు చేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ అమలు చేయాలన్నారు. ఉద్యానవన పంటలకు 2023 తర్వాత రాయితీలను నిలిపివేసారని దీనిని పునరుద్ధరించి రైతులకు సాయం అందించే చర్యలు తీసుకోవాలన్నారు. పండ్లతోటల పంటల విక్రయానికి అత్యంత ముఖ్యమైన మార్కెట్ సదుపాయాన్ని స్థానికంగా ఏర్పాటు చేయాలన్నారు. వంటల ఆధారిత చిన్న, మధ్యతరహా పరిశ్రమలను జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరారు. ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకోవడంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లా సాగునీటి వనరులనూ అభివద్ధి చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు, తుంగభద్ర కాలువ ఆధునీకరణ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇవన్నీ అమలు చేస్తే జిల్లాలో పండ్ల తోటల రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్, ఓ.నల్లప్ప

అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలంలోని విట్లంపల్లి గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న జయమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న అంగన్వాడీ సెక్టార్ లీడర్స్ తిప్పీరమ్మ, వన్నూరమ్మ ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఓబు ళమ్మ ఆ గ్రామం వెళ్లి మట్టి ఖర్చుల కింద రూ. 15వేలను జయమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. జయమ్మకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి సంతానం. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కుటుంబ సభ్యులు కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈబి.దేవి సందర్శించారు. ఆమె ఆసుపత్రి రికార్డులను తనిఖీ చేసి మందులు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్థానిక వైద్యుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా పనితీరు మార్చుకుని పేదలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతిరోజూ విధులకు హాజరుకావాలని, లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బందితో సమన్వయంతో పని చేయాలన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : ఎంపిపి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజాసమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం విడపనకల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, ఎంపిడిఒ షకీలాబేగం ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి, జడ్పిటిసి హనుమంతు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్యబాబు, ఎఒ భాస్కర్, వైస్ ఎంపిపి మోదుపల్లి సునీత, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్ గ్రూపులను గుర్తించండి

జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ

సమావేశంలో యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి -అనంతపురం

జిల్లాలో కిసాన్ డ్రోన్‌కు సంబంధించి కొత్త గ్రూపులు, పైలెట్లను గుర్తించి వారికి శిక్షణ కార్యక్రమం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ ఎడిఎలను ఆదేశించారు. గురువారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి ఎడిఎలు, మండల వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల్లో ప్రతి మండలానికి ఒక కిసాన్ డ్రోన్ సిహెచ్‌సి గ్రూప్‌లను గుర్తించి వారి వివరాలను జిల్లాకు పంపాలన్నారు. రబీ 2024-25 సంబంధించి ఈ పంట నమోదు, ఈకేవైసీని అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలన్నారు. ఈ పంట నమోదు తర్వాత వాటిని పరిశీలించడానికి సూపర్ చెక్ కింద కొన్ని సర్వే నెంబర్లు కేటాయిస్తామన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఫిర్యాదులను పరిశీలించి వాటిని లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు ఆత్మహత్యల దరఖాస్తులను గ్రామం, మండలం, డివిజన్ స్థాయి కమిటీ పరిశీలించి పంపాలన్నారు. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి రైతులకు పంట సాగుపై సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి సహాయ వ్యవసాయ సంచాలకులు రవి, ఎల్లప్ప, లక్ష్మానాయక్, వెంకటరాముడు, సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్ నాయక్, బాల నాయక్, వెంకటరాముడు, వ్యసాయ అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ

రాష్ట్రపతికి పంపనున్న వినతిపత్రాలను చూపుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

రాష్ట్రపతి దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు

ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రాలు పోస్ట్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు రాష్ట్రపతికి వ్యక్తిగత అర్జీలను పంపారు. గణేనాయక్ భవన్ నుంచి కొరియర్ ద్వారా వీటిని గురువారం పంపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, శకుంతల, రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీల క్రమబద్ధీకరణ, గ్రాట్యుటీ అమలు కోసం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు జిల్లా నుంచి అంగన్‌వాడీలు వినతిపత్రాలను పంపుతున్నట్లు చెప్పారు. ఎన్నికల ముందు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలిన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంపు, మినీ వర్కర్లకు ఉద్యోగోన్నతి ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఫిబ్రవరి 17 నుంచి దశలవారీగా పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టు స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు 17న వర్కర్లు, 18న ఆయాలు, 19న ఆర్డీవో కార్యాలయాల స్థాయిలో మినీ వర్కర్లు ధర్నాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి కాత్యాయని, అర్బన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు నక్షత్ర, రేవతి, షాహినా పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల కమిటీ నియామకం

నూతన సచివాలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని 9వ సచివాలయ ప్రాంగణంలో గత మంగళవారం ఎపి గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఎపిజిఎ అధ్యక్షులు గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామునాయక్, గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు హాజరై మాట్లాడారు. అనంతరం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గణేష్ అధ్యక్షతన కళ్యాణదుర్గం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్. నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఈ.శ్రీకాంత్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.నల్లప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.శ్రీకాంత్, ట్రెజరర్‌గా ఎం.పవన్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ములకేష్, ఉపాధ్యక్షు లుగా ఉపేంద్ర, అనిత, మనోజ్, గంగాధర్, శైలజ, రాము, జాయింట్ సెక్రటరీగా పంపాపతి, బసవ రాజు, దివాకర్, బి.వెంకటేషులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సంధ్య, కవిత, దివ్యశిల్ప, షఫీలను ఎన్నుకు న్నారు. సమావేశంలో ఎపిజిఎ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, పట్టణ ఉపాధ్యక్షులు సుధాకర్, ఈశ్వర య్య, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు గణేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భగీరథరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ మంజు నాథ్, నాయకులు మురళీకృష్ణసాగర్, వంద మందికి పైగా సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'నిర్లక్ష్యం వద్దు.. ప్రాణాలే ముద్దు'.!

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రోడ్డు ప్రయాణాల్లో నిర్లక్ష్యం వహించకూడదని, ప్రతివ్యక్తి ప్రాణాలే ముద్దుగా వాహనాలను నడపాలని రవాణా శాఖ అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం రహదారి భద్రతపై కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ ఉప కమిషనర్ వీర్రాజు, మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే సందర్భంలో రోడ్డు ప్రయాణంలో నిర్లక్ష్యాన్ని వీడి ఎదుటివారి ప్రాణాలను కాపాడుతూ.. మనల్ని మనం కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శశాంక్‌మౌళి, రవాణా శాఖ అధికారులు సురేష్‌నాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్‌రాజు, రవాణా శాఖ అధికారి మనోహర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు విష్ణుప్రియ, సుధాకర్, శ్రీనివాసులు, రామకృష్ణ, సోమశేఖర్, పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని చిన్నపప్పూరు సమీపంలో ఉన్న మోరల్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి ఎంవిఐ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కుటుంబం రోడ్డున పడుతుందనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోరల్ స్కూల్ అధినేత లక్కినేని ఆంజనేయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలులో నిబంధనలను సడలించాలి

సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

కందులను పరిశీలిస్తున్న సిఐటియు రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలను సడలించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం సమీపంలోని వ్యవసాయ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలను సడలించి కొనుగోలు కేంద్రానికి వచ్చిన కందులను ఒకే ధరకు కొనుగోలు చేయాలని కోరారు. అంతేగాకుండా ఎకరాకు రెండు క్వింటాళ్లు కాకుండా నాలుగైదు క్వింటాళ్ల వరకూ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర క్వింటాకు రూ.7,550తోపాటు అదనంగా రూ.2వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, లక్ష్మీపతి, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, ఆంజనేయులు, పుల్లయ్య, ఆంజనేయులు, మునయ్య, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

కందులతో నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-రాప్తాడు

మండల కేంద్రంలో కంది పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అనేకమంది రైతులు కందిపంటను సాగు చేశారన్నారు. అయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కందిపంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ శుక్రవారం కంది పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు ఎం.పోతులయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, బి.చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మన్న, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను వేధించొద్దు

సిఐటియు నాయకులు ఉమాగౌడ్

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు విడనాడాలని సిఐటియు నాయకులు ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. అధికారులు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రామాంజనేయులు, జుబేర్ విధుల్లో మార్పులు చేస్తూ ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ 4వరోజు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్ సప్లయ్ మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు మూతికి మాస్కులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు నాలుగు రోజుల నుంచి నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. చిన్నపాటి వివాదానికే స్పందించని అధికారులు ఇక ఏదైనా ప్రమాదాలు జరిగిదే స్పందిస్తారనే నమ్మకం లేకుండా పోయిందన్నారు. రామాంజనేయులు జుబేర్‌నే ఏకపక్ష వివక్ష తగదన్నారు. కమిషనర్ వెంటనే స్పందించి కార్మికులను వేధింపులకు గురి చేయకుండా యథావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, మున్సిపల్ యూనియన్ నాయకత్వం జుబేర్‌బాషా, ప్రసాద్, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కూడేరుకు రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

కూడేరు మండలానికి రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం కూడేరు మండలంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూడేరు మండలంలో రెగ్యులర్ తహశీల్దార్ లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా వారం రోజుల నుంచి బీసీ, ఎస్సీ కార్పొరేషన్ వివిధ రుణాల కోసం క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల సంతకాల కోసం దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారు పడిగాపులు కాస్తున్నారన్నారు. తక్షణమే ఆర్థికశాఖ మంత్రి జోక్యం చేసుకుని కూడేరు మండలానికి రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కరీంసాబ్, మండల సహాయ కార్యదర్శి వెంకటేషులు, నాయకులు మల్లికార్జున, వీరప్ప, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ పరిశోధన సంస్థలో విస్తృత ప్రయోగాలకు అవకాశం

విశ్రాంత ఆచార్యులు జివి.శంకర్

మాజీ ఆచార్యులుకు మొమెంటో అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థలో ఉన్న ప్రయోగశాలలో జీవ, ఔషధశాస్త్రాల విద్యార్థులు విస్తృత పరిశోధనలు చేసేందుకు అవకాశం ఉందని జెఎన్‌టియు విశ్రాంత ఆచార్యులు జివి.శంకర్ సూచించారు. గురువారం ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 'జీవ, ఔషధ శాస్త్రాల విద్యార్థులకు వాస్తవ (వర్చువల్) ప్రయోగశాలల విధానాన్ని అమలు చేయడం'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రయోగశాలలు విస్తృత ఉపయోగాలను జెఎన్‌టియు అనుబంధ ఔషధ కళాశాలలు కూడా ఉపయోగించుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని గూగుల్ లింక్ ద్వారా వివిధ సమాచారాన్ని అందించినట్లు తెలిపారు. అనంతరం శంకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వివి సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ ఎం.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వరం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం లాంటిది అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గురువారం అనంతపురం న్యూ టౌన్ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజన సమయానికి ఆయన కళాశాలకు వెళ్లారు. అదే ప్రాంగణంలో ఉన్న హై స్కూల్, ఉర్దూ స్కూల్, ఒకేషనల్ కళాశాలలో కూడా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న విద్య గురించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అన్నది అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. అనంతరం వారితోనే కలిసి భోజనం కూడా చేశారు. మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థుల స్పందన అడిగి తెలుసుకున్నారు. త్వరలో పాలిటెక్నిక్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

రైల్వే జోన్ హెడ్‌క్వార్టర్స్‌ను సికింద్రాబాద్‌లోనే ఉంచాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రైల్వే జోనల్ హెడ్‌క్వార్టర్స్‌ను సికింద్రాబాద్‌లోనే ఉంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోనే ఉందన్నారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత జోన్ మారుస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పుడు దాన్ని సిపిఎం వ్యతిరేకిస్తూ అనేక ఉద్యమాలు చేసిందన్నారు. ఇప్పుడు రైల్వే జోనల్ హెడ్‌క్వార్టర్స్‌ను విశాఖకు తరలించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. రైల్వేజోన్‌ను విశాఖకు మార్చడం వల్ల రైల్వే ఉద్యోగస్తులు వారి సమస్యలపైన విశాఖపట్నానికి వెళ్లి రావాలంటే అనేక ప్రయాసలు పడాల్సి వస్తుందన్నారు. రైల్వే ఉద్యోగ, కార్మికులను దృష్టిలో ఉంచుకుని జోనల్ హెడ్ క్వార్టర్స్‌ను సికింద్రాబాద్‌లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇతర రాజకీయ పార్టీలు, రైల్వే కార్మికులు, ప్రజాసంఘాలు, ప్రజలను కలుపుకుని పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు జగ్గిలి రమేష్, సాకే నాగరాజు, సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యుడు రామునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పాత కొత్తచెరువు జడ్పీ హైస్కూల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

డిఇఒకు ఎస్‌ఎఫ్ఐ నేతల వినతి

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గుంతకల్లు మండలం పాత కొత్తచెరువు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధు, ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిఇఒ ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతుర్ పరమేష్ మాట్లాడుతూ పాత కొత్తచెరువు పాఠశాలలో 450 మంది విద్యార్థులు చదువుతున్నారని, మూడు రోజులుగా తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్యను పరిష్కరించడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. చేసేది లేక విద్యార్థులే లీటర్ బాటిల్స్ తీసుకొచ్చి తాగాల్సి వస్తోందన్నారు. ప్రత్యామ్న్యాయ మార్గం చూపడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని కోరారు. ఇందుకు డిఇఒ స్పందిస్తూ పాఠశాలలో మంచినీటిని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నగర అధ్యక్షుడు భీమేష్, నగర ఉపాధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిగా మార్చేందుకు కృషి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు, అధికారులు

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మార్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఆసుపత్రి సలహా మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ హోదాలో హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్కువ శాతం పేదలే వస్తుంటారని వైద్యులు బాధ్యతగా పని చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతినెలా ఒకసారి సమావేశాలు ఏర్పాటు చేసి సభ్యుల సూచనలు, సలహాలు తీసుకుని వైద్యులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజలకు మెరుగైన వైద్యం, ఆసుపత్రి అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా సదరం క్యాంపునకు వచ్చే వికలాంగులకు భోజన వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కెసి.హరికుమార్, డాక్టర్ పత్తి హిమబిందు, నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, బిజెపి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు ప్రాధాన్యత : ఎస్పీ

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడే రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ పి.జగదీష్ కోరారు. సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్‌తో కలిసి గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సైబర్ నేరాలు, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న రోడ్డు ప్రమాదాలు, జీవితాలు నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల అనర్థాలపై ప్రజల్లో చైతన్య తేవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ మూడు అంశాలపై పోలీసు పరంగా అలుపెరగని కృషి చేస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదే సమయంలో సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన తీసుకొస్తే బాగుంటుందని సంకల్పించామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజాన్ని ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా పాత్ర కీలకంగా మారిందన్నారు. యూట్యూబర్స్ సామాజిక బాధ్యతగా భావించి సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలుపై రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలు చేయాలని కోరారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల కట్టడి, ప్రమాదాలు జరిగినప్పుడు ఆ గోల్డెన్ హవర్ లో క్షతగాత్రులను సమీప ఆసుపత్రుల్లో చేర్పించి కాపాడటం, రోడ్డు సేఫ్టీ నిబంధనలపై ప్రజల్లో అవగాహన చేయడం, గంజాయి, తదితర మత్తు పదార్థాల అనర్థాలు, వాటి జోలికెళితే జీవితాలు ఎలా నాశనం అవుతాయనే కోణాల్లో ప్రజలను అప్రమత్తం చేసేలా రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలు తీయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డివి.రమణమూర్తి, డీఎస్పీ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సిఐ షేక్ జాకీర్, కోర్టు మానిటరింగ్ సెల్ సిఐ వెంకటేష్‌నాయక్, 150 మంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి

శింగనమలలో పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం నులి పురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ భాస్కర్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 10వ తేదీ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలతోపాటు బడిబయట పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. సిహెచ్ఒ గంగాధర్ మాట్లాడుతూ నులిపురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత, పోషకాహర లోపం, ఆకలి మందగించటం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆయా లక్షణాలు ఉంటే వెంటనే గుర్తించి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. అనంతరం ఎంఇఒ సమక్షంలో పాఠశాలలు, అంగన్వాడీల కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ నాగభూషణరెడ్డి, ఎంపిహెచ్ఎ నాగరాజు, ఎపిఒ శ్రీదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నులి పురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. ఇందులో భాగంగా ఎంఇఒ మల్లికార్జున సమక్షంలో పాఠశాలలు, అంగన్వాడీల కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బుల్లే విజయలక్ష్మి, సిహెచ్ఒ శివప్రసాద్, సూపర్‌వైజర్ నరసింహ, సావిత్రి ఎపిఒ, తదితరులు పాల్గొన్నారు.

బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

12న రథోత్సవం

బొలికొండ రంగనాథస్వామి దేవాలయ (ఇన్‌సెట్‌లో ఉత్సవ విగ్రహాలు)

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.గురుప్రసాద్, సహాయ కమిషనర్ కె.ఆదిశేషనాయుడు, ఆలయ కార్యనిర్వాహనాధికారి సి.రామాంజనేయులు పర్యవేక్షణలో ఆలయంతోపాటు పరిసరాల్లో సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా కళ్యాణకట్టతోపాటు స్థానపు గదులు నిర్మించారు. నూతనంగా చిన్న రథం కూడా తయారు చేయించి షెడ్డును ఏర్పాటు చేశారు. గురువారం ధ్వజరోహణతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం సింహవాహనోత్సవం, 8న శేషవాహనోత్సవం, 9న హనుమద్ వాహనోత్సవం, 10న గరుడ వాహనోత్సవం, 11నన గజవాహనం, కళ్యాణోత్సవం, 12న రథోత్సవం, 13న పారువేట, అశ్వవాహనోత్సవం, 14న వసంతోత్సవ, హంసవాహన సేవతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా రథోత్సవానికి జిల్లానుంచే కాక ఇతర జిల్లాలు, కర్నాటక రాష్ట్రం నుంచి భారీ ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాలకు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హాజరుకానున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సి.రామాంజనేయులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

9 రోజులపాటు జరిగే రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ సందర్భంగా తిరుణాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. ఇతర వాహనాలు వెళ్లేందుకు ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేశాం. భక్తుల కోసం సౌకర్యాలు కల్పించాం. ఉత్సవాలకు భక్తులు ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకొని మొక్కు తీర్చుకోవాలి

సి.రామంజనేయులు,
కార్యనిర్వాహనాధికారి, బొలికొండ రంగనాథస్వామి దేవస్థానం.

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు

అనంతపురం కార్పొరేషన్ : మహిళల ఆత్మగౌరవం కాపాడటంలో భాగంగా నగరంలో అవసరమైన చోట మరుగుదొడ్లను నిర్మించనున్నట్లు అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ హామీ ఇచ్చారు. అహుడా అధికారులతో కలిసి గురువారం నగరంలోని వివిధ రద్దీ ప్రాంతాల్లో టిసి వరుణ్ పర్యటించారు. ఇందులో భాగంగా ఎక్కడైతే మరుగుదొడ్లు అత్యవసరమో గుర్తించారు. ప్రత్యేకంగా మహిళల మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో పలువురు మహిళలు వరుణ్‌తోపాటు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అహుడా సెక్రటరీ గౌరీశంకర్, ఎగ్జిక్యూట్ ఇంజినీర్ దుష్యంత్, ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ ఇషాక్, సర్వేయర్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపు తనిఖీ

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి వైబిపిటిఎ ప్రసాద్ ఆదేశాల మేరకు గుత్తి ఆర్ఎస్‌లోని బండి ఉమామహేశ్వరికి చెందిన చౌకధాన్యం దుకాణాన్ని గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దుకాణంలోని పుస్తకం, భౌతిక నిల్వల్లో వ్యత్యాసాలు ఉండటంతో కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.శ్రీనివాసులు, వాసుప్రకాష్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ హిమబిందుకు సన్మానం

పుట్లూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందును వైద్యాధికారిణి శ్రీవాణి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. హిమబిందు వైద్యవృత్తిలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసేందుకు వెళ్తున్న సందర్భంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాఘవరెడ్డి, పుట్లూరు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులే లక్ష్యం : కలెక్టర్

గుత్తి : ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివేలా వారిని ప్రేరేపించాలని కలెక్టర్, విఎంసి ఛైర్మన్ వి.వినోద్‌కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో విఎంసి వైస్‌ఛైర్మన్, తహశీల్దార్ డి.ఓబిలేసు, ప్రిన్సిపాల్ ఎం.మల్కిసాబ్, అసిస్టెంట్ కమిషనర్లు టి.ప్రభుదాసు, పి.అనురాధ, విఎంసి సభ్యులు ఎన్.ఉషా, ఉషారాణి, ఎం.నాగవేణి, రామకృష్ణారావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

గుత్తి : ప్రస్తుతం కాలుష్యం పెరుగుతున్న తరుణంలో అందరం కలిసికట్టుగా పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సిఇఒ ఎం.నారాయణస్వామి, సెట్రీస్ ప్రోగ్రాం మేనేజర్ పీరావలి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తపేట గ్రామం వద్ద ఉన్న హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయం వద్ద హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ, సెట్రీస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మామిడి, చీనీ, నిమ్మ, నేరేడు, ఎర్రచందనం, మహాగని, కొబ్బెర మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, నాయకులు జక్కల చెరువు ప్రతాప్, ఆర్.సాల్మన్ రాజా, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ,సెట్రీస్ సంస్థ సమన్వయకర్తలు భాగ్యలత, నాగలక్ష్మి, శివశంకర్, సుమంత్, గురు ప్రసాద్, జయరాజు, హరి, నాగార్జున, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

శింగనమల : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని ఆకులేడు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వడ్డే నాగరాజు కుటుంబానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మల్లికార్జున, టిడిపి సీనియర్ నాయకులు వడ్డే నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు

ఉచిత కుట్టు శిక్షణ

అనంతపురం రూరల్ : జిల్లా నిరుద్యోగ మహిళల సౌకర్యార్థం స్థానిక రూడ్‌సెట్ సంస్థలో 30 రోజుల ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

రంగనాథుడి హుండీ లెక్కింపు

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో హుండీని గురువారం లెక్కించారు. ఇందులో రూ.7.95 లక్షలు ఆదాయం ఆలయ కార్యనిర్వాహణాధికారి సి.రామాంజినేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ బి.రంగస్వామిరెడ్డి యాదవ్, గ్రామ పెద్దలు బి.చిన్నరెడ్డి యాదవ్, డేగా మద్దిలేటి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్ పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

నార్పల : ప్రభుత్వ ఆదేశాల మేరకు బిసి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు ఎంపిడిఒ గంగావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకూ అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

స్థలం కేటాయించాలని పద్మశాలీయుల వినతి

అనంతపురం : జిల్లాలో పద్మశాలి కులస్తులకు కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం ఐదెకరాల స్థలం కేటాయించాలనిఎపి పద్మశాలి సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌తోపాటు డైరెక్టర్లు కోరారు. ఈమేరకు గురువారం గొల్లపూడి బిసి భవన్‌లో బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పొరాళ్ల పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్ దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఒటిపిఆర్ఐ కళాశాలలో బి.ఫార్మసీ, ఫార్మా-డి స్పాట్ అడ్మిషన్ కోసం దరఖాస్తు గడువు ఈనెల 7వతేదీ సాయంత్రం 5.30 గంటల వరకూ పొడిగించినట్లు జెఎన్‌టియు అడ్మిషన్స్ డైరెక్టర్ ఎ.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో అన్ని ఒరిజినల్స్ సర్టిఫికెట్లు, డిడిలు సబ్మిట్ చేయాలని కోరారు.

పంటకోత ప్రయోగం

పుట్లూరు : మండలంలో ఎల్లుట్ల గ్రామంలో రైతులు చిన్న యంగమ్మ, విశ్వనాథం పొలాల్లో సాగు చేసిన పప్పుశనగ పంటలో ఎఇఒ హరి ఆధ్వర్యంలో గురువారం పంటకోత ప్రయోగం చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ ప్రవీన్, విఆర్ఎ, రైతులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకులకు 'ఆకుల' సంఘీభావం

నార్పల : మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'మాదిగల లక్ష డప్పులు.. వేయి గొంతులు' కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు) మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ నాయకులతో కలిసి డప్పు కొట్టి ఉత్సాహ పరిచారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మృతిచెందిన హనుమంతు

గుమ్మఘట్ట : మండల పరిధిలోని 75 వీరాపురం గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కర్నాటక రాష్ట్రం పెదారగుడ్డం గ్రామానికి చెందిన బోయ హనుమంతు (35) ఆకుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగా గుమ్మఘట్టకు వ్యాపారం చేసుకుని తిరిగి వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో హనుమంతు అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే మరో ద్విచక్ర వాహనంలో వచ్చిన చాకలి వన్నూరుస్వామి, శాకమ్మకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఈశ్వరయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.